# గాసుగ బ్రతుకు

రచన:
—సచ్చిదానందశర్మ

"కూలిరానండయ్యా...''

'.........'

'కూలికావాలండీ బాబు '

'.........'

—'ఏయ్! కూలీ...!'

'ఆఁ! బాబూ వస్తున్నా'

'ఎక్కడికండీ?'

'ఇక్కడికే...ఘంటశాలవారి సత్రంపక్కని ఇల్లులేదూ? అక్కడికి'

'ఆఁ! ఇంటిముందు వీధిపంపుకూడా ఉంది. ఆయింటికేనండీ?'

'కాదు. అపక్క ఇంటికి'

'సరే ఏంతేవాలయ్యా'

'కూరలు...వెచ్చాలూ...అవ్వీ కొద్దిగా తీసుకోవాలి'

'పదండి...'

ఒక ఇరవై నిమిషాలు గడిచింది.

'తొందరగా తీసుకోండిబాబూ వెచ్చాలు'

'తొందరపడితే ఎలా? అన్నీ కావాలా, అక్కర్లేదా?'

'నాలుగుచోట్లకుతిరిగి రెండు డబ్బులు తెచ్చుకుంటేనేకాని పొట్టగడవదండీ'

'.........'

'అటెక్కడికండీ'

'గోపాలంగారి కొట్టుకి పచారిసామాన్లు కావాలి'

'ఇంతసేపు ఇక్కడనిలబెట్టి ఇటెక్కడికండీ'

'కుటుంబరావు కొట్టుకి పోడరుడబ్బా, సబ్బు పెట్టె...అవ్వీ తీసుకోవాలి'

'ఇలాతిప్పి ఇంత ఆలస్యంచేస్తే ఎలాగండీ. పూటంతా ఒక్కకూలీతోనే సరిపోయేట్లుంది.'

దాదాపు ఒక నలభై నిమిషాలు గడిచింది.

'బాబూ! కూలీఇవ్వరండీ?.

'సామాన్లన్నీ బుట్టలోంచి కిందకదించేశావా?'

'ఆ, దించేశా. చూసుకోండి'

'కూలిఎంత?'

'ఏదో మీదయ'

'ఊఁ...ఇంద.'

'ఎంతండీబాబూ! అణానా? ఇంతసేపూ ఈ కొట్టునుంచి ఆకొట్టుకూ ఆకొట్టునుంచి ఈ కొట్టుకూ తిప్పితిప్పి అణా చేతులోపెడుతున్నారండీ?'

'ఆఁ, మరెంత? మేమెప్పుడు తట్టకూలీ చేత సామాన్లు తెచ్చుకోవటంలేదా?'

'ఏమిటిరా ఆగోల?'

'కాగునాన్నా బజారునుంచి తట్ట మోసుకు వచ్చినందుకు అణాన్నర, బేడా అడుగుతున్నాడు.'

'ఏయ్! ఎవరునువ్వు?. ఈ ఊళ్లోకల్లాను వ్వొక్కడివే కూలివాడిలాగా మాట్లాడుతున్నావే! ఎవడు నీకు అణాకంటె ఎక్కువ ఇచ్చేది?'

'కాదుబాబూ మీరు ఒక్కరే కూలివాళ్ళచేత సామాన్లు తెప్పించుకునేవారు. ఎంత దయ లేకండా మాట్లాడుతున్నారండీ!'

'ఏయ్! పిచ్చిపిచ్చిగా మాట్లాడబోక. పళ్లు రాల్తాయి తెలుసునా? మోసేది తట్టకూలి అయినా చాలా తలబిరుసుఉందే! అణాకంటె ఎక్కువఇవ్వం. తీసుకువెడితే తీసుకువెళ్ళు లేకపోతే లేదు.'

'పోనీలేబాబూ మేడకట్టు.'

'ఇట్టావస్తున్నా వెక్కడ్నుంచిరా? మొహం వేళ్ళాడేసుకునికి'

'ఆ సావుకారుచూడరా! బజారంతా ఎండలో తిప్పితిప్పి అణా చేతులోపెట్టొచ్చాడు ఇంకో అర్థణా అడిగితే మీదిమీదికొస్తున్నాడు'

'నేవెళ్లినచోటా అంతేరా ఇంకో అర్థణా ఎక్కువడిగానని పెద్ద రాద్ధాంతంచేసేడు మళ్ళీ పెద్ద మేడకట్టేడు ఏంలాభం?'

ఇంతలో ఏదో కేకవినపడింది. ఇద్దరూ తలోవైపుకూ వెళ్ళిపోయారు. మళ్ళీ మామూలే!

'కూలిరానండయ్యా'

'.........................'

'ఏయ్! కూలీ!'

'ఆఁ! బాబూ వస్తున్నా!'